# మనుగడకోసం పోరాటం !

డియర్ అంకుల్....

నమస్కారం.

చాలా రోజులుగా మీకు లెటర్ రాయాలనుకొంటున్నాను, మీకు చెందిన కొంత విశ్లేషణను జోడించి. నా కలం ముందుకు సాగటంలేదు. ప్రయత్నం మీద ఈ రోజు రాస్తున్నా. నా లేఖ ఆసాంతం చదివి నాలోని అనుమానాల్ని నివృత్తి చేయగలరని భావిస్తున్నాను. నేను అధ్యయనం చేస్తున్న కొన్ని మానసిక విశ్లేషణాత్మక పత్రికలు నాతో కొంత జిజ్ఞాసనూ గందరగోళాన్ని సృష్టించాయి. కాగా మీ జవాబులో ఈ విషయాలన్నింటినీ తడవగలరని ఆశిస్తున్నా.

మీరు చాలాకాలంగా పత్రికా రంగంలో ఉంటున్నారు. ఆ సందర్భంలో రకరకాల వార్తలు, వాటికి మీ రూపకల్పన, ప్రచురించటంలో మెంపైన శిల్పం ఉంటుంది. అలాగే వివిధ రకాల అనువాదాలు చేస్తున్నారు. నాలాంటి రచయితల్ని, కవుల్ని ప్రోత్సహిస్తున్నారు. మీ రచనలను గమనిస్తే మీ నుండి సృజనాత్మకంగా వచ్చిన రచనలు అత్యంత స్వల్పంగా ఉన్నాయి. ఎక్కువ భాగం అనువాదరచనలే. దాని వెనుక ఏమైనా కారణాలున్నాయా? మీలో సృజనాత్మకత ఎంతగా నిబిడీకృతమైనా అనువాద రచనలకు మించి ఎందుకు రాయలేకపోతున్నారు ? మీలో సృజనాత్మక శక్తి....వాస్తవాల్ని కళాత్మకంగా మలచటంలో ప్రతిభ లేదని నేనెలా ఊహించగలను! మరెందుకు మీరు రాయటం లేదు? ఏ కారణాల్తో?

ఎన్నో సంవత్సరాలుగా పత్రికారంగంలో వుంటూ, అనేక మంది రచయితల్ని, విశ్వ జనీన రచనల్ని చదివి, జీర్ణించుకొని, జీవితాన్ని మధించి, అందులోని విభిన్న కోణాల్ని ఆకళింపు చేసుకొన్న మీ కలం కదలకపోవటం వెనుక ఏ కారణం వెదుక్కోవాలో, ఏ ఎనాలిసిస్‌ను చేపట్టాలో నాకర్థం కావటంలేదు. అలాంటప్పుడే "టుమారో" అన్న పత్రిక నాలో జిజ్ఞాసను రేకెత్తించింది. ఆ పత్రిక కొంత ఆలోచనను రేకెత్తించిందేగాని, సరయిన సమాధానం ఇవ్వలేకపోయింది. ఆ పత్రిక ప్రకారం ఒక్కొక్కరు తమ తమ జీవితాల గురించి ఏవేవో ఊహించు కోవచ్చు. కానీ ఫలితం మరోలా వుంటుంది. ఉదాహరణకు గొప్ప రచయిత కావాలనుకున్న వ్యక్తి పబ్లిషర్ కావచ్చు. గాయకుడు కావాలనుకున్నవారు పాటలు రాసేవారిగానూ, నటుడు కావాలనుకున్నవారు నిర్మాతగానూ మారొచ్చు. నా అనుభవంలో సైతం అలాటి సంఘటనలున్నాయి. వాట న్నింటికీ ఆ సంపాదకుడు ఏవేవో మానసిక రోగాల పేర్లు తగిలిస్తున్నాడు. వాటిలో ఏ మేరకు వాస్తవికత ఉంది? మనుషుల్లో కనిపించే ఈ తేడాల్ని, యీ పరిణామాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఇవి నిజంగా మానసిక వ్యాధులేనా? పోని వాటి ప్రభావం కొంచెమైనా ఉంటుందా?

మరి మీరు సృజనాత్మక రచనలు చేయటంలో ఎందుకు విఫలం అయ్యారు! మీలో మానసిక పరమైన ఆవేశాలు, బాధలూ గూడు కట్టుకు పోయాయా? వాటిని భరించలేకపోతున్నారా? దయచేసి మీరు రాయండి. మీ వ్యక్తిగత విషయాల జోలికి వెళుతున్నానని నేననుకోవటంలేదు. అలాగే మన నడుమ ఉన్న బాంధవ్యం మూలంగా నేను ప్రశ్నించటం లేదు. ఓ సృజనాత్మక మేధావి యొక్క శక్తులు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయనే బాధ నన్ను తీవ్రంగా కదిలించి వేస్తూంది మీరు రాయాలి క్రామేడ్... మీనుండి మేం గోర్కీ, చెకొవ్, లూసన్ రచనల అనువా దాలుకాదు ఆశిస్తోంది. ఈ దేశపు జన జీవితం గురించిన మీ విశ్లేషణ.

మీ భావం... మీ అవగాహన మాకు కావాలి.

అనంత ప్రజా జీవితంలో ఓ భాగంగా ఉన్న మీరు, వారినుండి ఎంతగానో నేర్చుకుంటూ వారికి చెప్పగలిగిన మీరు ఎందుకు మౌనం

వహిస్తున్నారు? మీరు రాస్తే మనకు సైతం గొప్ప రచనలు ఉండేవనేది నా నమ్మకం. అవి గొప్ప కదలికను కలిగించటమే కాకుండా ప్రపంచ రచయితల స్థాయిలో మిమ్మల్ని నిలబెట్టేవని నేను చెప్పగలను. అందుకే మిమ్మల్ని వత్తిడి చేస్తోంది. ఇప్పటికయినా మీ అంతరాంతరాల్లో నిక్షిప్త మైన ఆ భావాల్ని వెలికితియ్యండి, మాకు తెలియ చెప్పండి. ఇది విన్నపం... ఇదికోర్కె ... ఇది డిమాండు !

నిజంగానే ఎలాంటి కారణం లేకుండా ఏ ఎదురుదెబ్బలూ తినకుండా ఏ సామాజిక కారణాలు, ఏ మానసిక వ్యాధులు లేకుండానే మీరు సృజ నాత్మకంగా రాయలేకపోయారంటే అదో గొప్ప విషయమే. అప్పుడు మరింత లోతుగా ఆలోచించాల్సిన అవసరం వుంది. కాబట్టి మీ జవాబు సమగ్రంగానూ, వివరణాత్మకంగానూ వుంటుందని ఆశపడుతున్నాను. నా సమస్యను మీ ముందుకు తెచ్చి మీ సమాధానం వినొచ్చు. కానీ లిఖిత పూర్వకంగా అయితే ఎన్నో అంశాలు తడవగలరనే ఆశ. కొంత సమయం తీసుకున్నా మీనుండి సరైన విమర్శతో కూడిన జవాబు అంద గలదని నా నమ్మకం.

ఈ నడుమ ఏమీ రాయలేకపోతున్నాను. కారణం మీరే. మీ గురించి నా ఈ తాత్విక భావాలే నన్ను ఆలోచింపచేసున్నాయి. నా ఆలో చనలు చిందరవందరగానూ, వివిధ రకాలుగా ఉంటున్నాయి. ఈ గందర గోళంతో ఏం రాసినా అవెలా ఉంటాయో మీకు తెలుసు. మీ జవాబు చూశాక.... అప్పుడు తిరిగి రాస్తాను- మీ నుండి సరైన స్ఫూర్తిని పొంది.

మీ జవాబు కోసం ఎదురు చూస్తూ

నమస్కృతుల్తో, మీ స్పందన్

ప్రియమైన స్పందన్

దీర్ఘమైన నీ లేఖ అందింది. వెంటనే జవాబు రాయటం కుదర లేదు. నా గత జీవితాన్ని, వర్తమానాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం కలిగింది. వారం రోజుల పాటు ఆత్మ విమర్శ చేసుకున్నాక నీకి జవాబు రాస్తున్నా. ఇది సమగ్రం అని నేను భావించటంలేదు. నా అవగాహనలో

కూడా లోటుపాట్లుండవచ్చు. నేను అర్థం చేసుకున్న పరిధిలో నీకో చిత్రం ఇవ్వడానికే నా ప్రయత్నం.

నిజమే! నువ్వు రాసినట్లుగా నేను సృజనాత్మక రచనలు చెయ్యలేకపోతున్నాను. ఒకటో, అరో చేసినా అవి లెక్కలోకి రావు. నేను రచనలు చేస్తే అవి గోర్కీ చెంతన నిలబడతాయా లేవా అనేది కాదు ప్రధానం. నేనెందుకు రాయలేకపోతున్నాను? ఈ ప్రశ్న వారం రోజులుగా నన్ను ఆలోచింపచేసింది. రాయకపోవటం వెనుక బలమైన సెంటిమెంట్ గాని, వ్యక్తులుగాని లేరు. అది మాత్రం వాస్తవం! ఈ సమాజమే నేను రాయలేకపోవటానికి కారణం. అంతేగాని మానసిక వ్యాధి.... తీవ్రత.... మరో కారణం మాత్రం కాదు.

సృజనాత్మక శక్తులనేవి చెట్లలాంటివి. అవి ఎప్పుడు ఎదుగుతాయి? సరైన వాతావరణంలో తగిన శ్రద్ధతో పెంచి, వాటికి రక్షణ కలిగిస్తే అవి ఎదిగి తమ ఫలాన్ని ఇతరులకు అందజేస్తాయి.

ముఖ్యంగా అవి ఎదగాల్సిన తరుణంలో వాటికి ఎంతో జాగ్రత్తతో కూడిన పోషణ అవసరం. అలాంటి పరిస్థితులు లేకుంటే అవి ఎండిపోతాయి. నా విషయంలో జరిగిందదే!

నా బాల్యం నుండి కుటుంబ జీవితంలోగాని, సామాజిక జీవితంలో గాని నాకు స్వేచ్ఛలేదు. కనిపించని ఉక్కుసంకెళ్ళేవో నన్ను బంధించి వుంచాయి. నా కిష్టమైన చదువు చదువు చదువుకోవటానికి, నా ఇష్టమైన బట్టలు కట్టుకోవటానికి, నా అంతరాంతరాల్లోని ఊహలకు రూపం ఇవ్వటానికి నాకు అవకాశాలులేవు. ఎన్నెన్నో ఆటంకాలు, ఆర్థిక ఇబ్బందులు. నేను ఎవర్ని ద్వేషిస్తానో వారితోనే నాకు పని! ఏ విలువల్ని ఖండిస్తానో వాటి నడుమే సహజీవనం! వాటన్నింటి నడుమ సెన్సిటివ్‌గా వుండటం కష్టం. ఈ విషయాలన్నీ నామీద తీవ్రంగా ప్రభావం చూపించాయి. నాలో అప్పుడప్పుడే వికసిస్తున్న సృజనాత్మక శక్తుల ఎదుగుదలకు అప్పుడే ఆటంకం ఏర్పడింది.

పెళ్ళయింది. సంసార జీవితంలోకి అడుగుపెట్టాను. పాత, క్రొత్త భావాలకు ప్రతినిధులుగా ఉన్న మేం.... కొన్ని విషయాల్లో ఏకీభవించినా

అనేక విషయాల్లో విభేదించాం. సామాజిక జీవితంపట్ల, గమ్యంపట్ల ఆమె భావాలు వేరు. నావివేరు. ఆమెను నా వెంట తీసుకురావటానికి తీవ్రంగా ప్రయత్నం చేయాలి. అదే సమయంలో ఆమె నన్ను నా మార్గంనుండి ప్రక్కకు మరల్చటానికి తన శక్తులన్నింటినీ కేంద్రీకరిస్తుంది. అంతర్గత పోరాటం సామాన్యంకాదు. అత్యంత బాధాకరమైన పోరాటం అది. శత్రువుతో పోరాటం వేరు. అది ప్రత్యక్ష రంగంతో ముడిపడివుంటుంది. ఒకేచోట జీవిస్తూ, నిత్యం ప్రతి అంశంలోనూ భాగంపంచుకునే వ్యక్తులు చేసే పోరాటం. ఆ పోరాటంలో అనేకరకాలయిన భావావేశాలు, ప్రభావాలు నిండివుంటాయి. పిల్లలు పుడుతున్నకొలదీ ఆర్థికంగా బాధలు ఎక్కువవు తున్నప్పుడు ఆ పోరాటం విభిన్న రూపాల్లోకి మారితీరుతుంది.

బయటినుండి చూసేవారికి అది అర్థంకాదు. ఎక్కువమంది రాళ్ళు వేయటానికే ప్రయత్నిస్తారు. ఎంత ఎదిరించినా ఈ సమాజంలో బ్రతుకు తున్నాం. ఈ సంప్రదాయాల నడుమ ప్రయాణం చేస్తున్నాం. వాటి ప్రభా వాలు సోకవని ఊహించుకోవటమే కష్టం. అలా భావించని వారు మానవ స్వభావాల్లోని ప్రవర్తనల వెనకగల సామాజిక కారణాల్ని అర్థం చేసుకో లేరు. చేసుకున్నా ప్రాముఖ్యం ఇవ్వరు. అందుకే వారు వాటిని వ్యక్తిగత స్థాయికి కుదించటమో లేక మొత్తంగా మానవత్వం మీదే ద్వేషం పెంచు కోవటమో చేస్తారు. కాగా మనపై కుటుంబ జీవిత ప్రభావం ఎంతో ఉంటుంది. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఇలాంటి అనుభవాలు అందరికీ ఒకేలా ఉండవు. అందరూ ఒకేలా ప్రవర్తించరు. స్పందించరు. చెప్పానుగా ఇలాంటి విషయాల్లో సెన్సిటివ్ వైఖరితో వుండటం మరీ కష్టం. అయినాసరే మన భావాల్ని బలవంతంగా కుటుంబం మీద, భార్యా బిడ్డల మీద రుద్ద కూడదు. వారి అభిప్రాయాలు తప్పయినా గౌరవించాలి. మనవంతు కర్తవ్యం చెప్పటమే! మెల్లగా మార్చుకోవటమే!

ఆర్థికంగా ఇబ్బందులు ప్రధానంగాఉండే కుటుంబాల్లో సంఘటనలు, తాత్వికభావాలు.... అభిప్రాయభేదాలు.... వీటన్నింటినడుమ పోరాడుతూ రావటం సామాన్య విషయంకాదు. ఇది నా అనుభవం. నా అనుభవం. అందరిదీ కాకపోవచ్చు.

నాకంటే దారుణమయిన బాధల్ని అనుభవిస్తూ కూడా వాటన్నింటినీ అధిగమించి గొప్ప పాత్రను నిర్వహించినవారున్నారు. ఉదాహరణకు మార్క్స్. మానవ జీవితాలకు తన గొప్ప మేధస్సులో వెలుగుబాట చూపిన మార్క్స్ చివరిరోజులలో అత్యంత కఠోరమయిన జీవితాన్ని, పేదరికాన్ని అనుభవించాడు. ఆ సమయంలో ఆయన ఎంత గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించాడు. రాయటానికి ఏ అక్షరాలు సరిపోగలవు! కాగా నేను చెప్ప దలుచుకుంది విభిన్న వ్యక్తుల అనుభవాలు విభిన్నరకాలుగా వుంటాయి. అందరూ ఒకేరకమైన ధైర్యంతో పోరాటం చెయ్యలేరు. అదేసందర్భంలో మార్క్స్ జీవితంలో గొప్ప ఎస్సెట్ ఆయన భార్య జెన్నీ. భర్తలంతా మార్క్స్‌లు కానట్లే భార్యలంతా జెన్నీలుకారు.

నేను పనిచేస్తుందెక్కడ. ఓ బూర్జువా పత్రికలో. అక్కడ మాకు ఏ మేరకు స్వేచ్ఛ ఉంటుంది? మేం రాసేవార్తల్ని నిర్ణయించేది యజమాని. మేం అతని పాలసీనిబట్టి రాయాలి వాళ్ళ పాలసీఏమిటి? వ్యాపారం. అదొక్కటేనా! యదాస్థితివాదం. జానెడు పొట్టకోసం కాలే కడుపుల్తో పోరాడుతున్న ప్రజానీకపు వార్తలు మేం అందించగలమా? ఎంతసేపూ నాయకుల బాధలూ, పంచెలూ, కార్లూ, వ్యక్తిగత అలవాట్లను హైలెట్ చేయటం మించి, పూర్తిగా అభినంధిస్తూనో, అభిశంసిస్తూనో తప్పించి ప్రజాభిప్రాయాల్ని యధాతథంగా ప్రతిబింభించలేంకదా! దానికి కొందరు అనొచ్చు. వచ్చి ప్రజల్తోకల్సి పనిచేయవచ్చుకదా అంటూ నాకో విషయం స్పష్టంచెయ్యాలి. మొదటి రష్యావిప్లవంలో పాల్గొన్నవారంతా 1917 నాటికి కలిసిరాలేదు. అందులో కొందరు జారిపోయారు. కొందరు లొంగుబాటు చూపారు. మరికొందరు శత్రువులుగా మారారు. ఎక్కువ మంది ఎగ్జిస్టెన్స్‌కోసం తలోదిక్కు అయ్యారు.

వారందరూ మానసిక కారణాల్తోనే ఇలా మారిపొయ్యారా? వీరం దరికీ బలమైన సెంటిమెంట్లున్నాయా? కొందరి విషయంలో కొన్ని మాన సిక వ్యాధులుండొచ్చు. తాము ఎంతగానో ఊహించుకొన్నవి విఫలం

కావటంతో కొంతమంది మానసిక స్థితిలో మార్పులు రావచ్చు. కుటుంబ జీవిత ప్రభావం కావచ్చు. వాటన్నింటి వెనుక ఉన్న కారణం ఏమిటి?

పెట్టుబడిదారీ వ్యవస్థ!

అదే.... కేవలం అదేకారణం!

ఈ దేశంలోనే కాదు. ఏ పెట్టుబడిదారీ దేశంలోనయినా ఇదే పరిస్థితి. ఆ వ్యవస్థకున్న గొప్ప ఆయుధం "స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్" అక్కడి ప్రజానీకం మనుగడకోసం జరిగే పోరాటంలోనే తమ శక్తులన్నిం కేంద్రీకరిస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ ఆయుధంతోనే తన పతనాన్ని వాయిదా వేస్తుంటుంది. ఈ ప్రజలకు సృజనాత్మక శక్తులులేక కాదు. అవి వినియోగించే అవకాశాలు లేవు, అలాంటి అవకాశాలు కల్పించబడవు కూడా.

ఈ మార్గంనుండి ప్రయాణంచేస్తున్న నాలో సృజనాత్మక శక్తులు క్రమక్రమంగా ఎండిపోయాయి. ఎదగటం మానేశాయి. నేనూ రాయాలను కొంటాను. విశ్వ జనీన రచనలు చేయాలని కాదు. నేను చూసే జీవితం, నేను చూస్తున్న వ్యధలు....పోరాటాలు... కానీ నాలోని సృజనాత్మక శక్తులు ఎదురుతిరుగుతున్నాయి. నేను రాయలేకపోతున్నాను. అందుకే ఎవరిలోనన్నా ఆ శక్తులున్నట్లు కనిపిస్తే వారిని ప్రోత్సహించటం. ప్రపంచ సాహిత్యంలో... పోరాటకాలంలో ఆ తర్వాత వచ్చిన గొప్ప రచనల్ని అనువదించి అందించటం! యువతరాన్ని ప్రోత్సహించటం...ఇప్పుడర్థమయిందనుకొంటాను కొంతవరకు.

ఆ తర్వాత నువ్వు చదువుతున్న మానసిక విశ్లేషణ పత్రిక గురించి ఆ పత్రికలో పడ్డ కొన్ని వ్యాసాలు చదివాను. ఓ వ్యక్తి భూస్వామిగా ఉండటానికి, పెట్టుబడిదారుడుగా ఉండటానికి కూడా మానసిక కారణాల్నే చూపించటం, పత్రికారంగంలో వస్తున్న విభిన్న ధోరణుల్లో ఓ రూపం అది. పెట్టుబడిదారీ సమాజంలో నూతన మార్గాల్ని అన్వేషించందే మనుగడ ఉండదు. అయితే అవేవీ యదాస్థితి వాదానికి అతీతంగానూ ఉండకూడదు. అందుకే ఏవి సామాజిక కారణాలవల్ల జరుగుతున్నాయో దాన్ని దాచే ప్రయత్నం చెయ్యటం....మరికొన్ని ధోరణులున్నాయి పరిశోధనాత్మ

కత! వాళ్ళెంతవరకు వెళ్ళి పరిశోధిస్తారు, వాళ్ళకు కావలసిందేమిటి ? సంచలనాత్మకత! కుంభకోణాల గురించి, వ్యక్తిగత వ్యవహారాల గురించి ఎంతో ఆడంబరంగా ప్రచురిస్తుంటారు. ఇలాంటి వారంతా ఈ దేశంలో జరుగుతున్న సవాలక్ష అన్యాయాల్ని ప్రచురించగలుగుతున్నారా! దానికి కారణం ఏమిటి ? ఈ సమాజాన్ని మీరెలా మార్చలనుకొంటున్నారు ? అందుకు వారి సిద్ధాంతం ఏమిటి? సమాజాన్ని మార్చటంలో పోరాడుతున్న వారి పట్ల వారి వైఖరి ఏమిటి? యువకులుగా ఉన్నప్పుడు వేడి రక్తం మూలంగా విప్లవమనే కేకలు-వృద్ధాప్యంలో ఆధ్యాత్మికత అని సూత్రీకరించే వారంతా ఎవరి ప్రయోజనాలకు నిలబడుతున్నారు? ఈ వ్యాధులన్నీ ఎక్కడనుండి పుడుతున్నాయి ?

ఇవన్నీ ఆర్థిక కట్టడంనుండి ఉద్భవిస్తున్నాయి. వీటిలో రకరకాలు. అందుకే ఓ విషయం తెలుసుకోవాలి. “ఏ అక్షరాల వెనుక ఏ వర్గాలు దాగి వుంటాయో” తెలుసుకున్ననాడే ఎవరి భావాలు ఏమిటో అర్థమయ్యేది. ఉద్రేకపూరితంగా రాస్తేనో, సైన్స్ పేరు చెబితేనో, మానసిక విశ్లేషణ, పరిశోధనాత్మకత, మరొకటి, మరొకటి....ఇవేవీ సరైనవి కాకపోవచ్చు.

నిజమే. కుంభకోణాల్ని, బూర్జువా వ్యక్తి జీవితంలోని కృత్రిమత్వాన్ని వెలుగులోకి తేవాలి. కాని ఎంతవరకు? వాటి గమ్యం ఏమిటి? ఈ దేశంలో ప్రజలంతా సమైక్యమై పటిష్టమైన కార్మికవర్గ పార్టీ నాయకత్వంక్రింద సమీకృతం అయి, పోరాడి మరో ప్రపంచం నిర్మించుకోవాలి. అలాంటి తాత్విక ప్రచారాన్ని, అలాంటి ఎనలైజేషన్ని అందించకుండా ఉండటానికి ప్రయత్నంచేసే వారెవరైనా ఎక్కడోచోట ఆగిపోతారు. వారి ప్రయోజనాలకు రాజీపడో లేక ముందుకు రాలేకో, శత్రువుగా మారో, మరో విధంగానో!

అందుకే....ఎక్కడ సృజనాత్మక శక్తులు వికసిస్తాయో...ఏ సమాజంలో మేధావులూ, 'దైవాంశ సంభూతులు' మాత్రమే కాక సామాన్య ప్రజానీకం సైతం తమ ప్రజ్ఞల్ని ప్రదర్శించే అవకాశాలుంటాయో ... ఎక్కడ మనుగడ కోసం పోరాటంలో అమూల్య కాలాన్ని పణంగా పెట్టకుండా వుంటారో, ఎక్కడ ప్రజలకు తమకిష్టం వచ్చిన రంగం ఎన్ను

కునే స్వేచ్ఛ వుంటుందో, పనిచేసే అవకాశాలుంటాయో, ఎక్కడ ప్రకృతి రహస్యాల గుండెల్లోకి వెళ్ళే ప్రోత్సాహాలుంటాయో...ఎక్కడ దోపిడీ... దౌర్జన్యాలు నశిస్తాయో....ఎక్కడ ప్రశాంతకర యుద్ధ వ్యతిరేక, శాంతి వాతావరణం వుంటుందో, ఎక్కడ కుటుంబ జీవితం ఓ శత్రువుపై రుధ్యంగా వుండదో ఆ సమాజాన్ని కలగంటున్నాను.

ఆ ప్రజల పోరాటాన్ని ఎన్ని పరిమితుల్లోనయినా గానం చేస్తున్నాను. మీలాంటి యువకులంతా మాలానే స్పందించాలనేం లేదు. మా తరంలోనే త్యాగాలకు మారుపేరులా ఉన్నవారిని ఆదర్శంగా తీసుకోండి. మీ అనుభూతులనుండి రాటుదేలండి. "వేయి పూవుల్ని వికసింపచేసే" సమాజం కోసం "క్రియేటివ్ ఫోర్స్‌ను ధ్వంసంచేసే వ్యవస్థను ధ్వంసం చెయ్యటానికి నడుం బిగించండి. పదండి ముందుకు.

నాపట్ల నీకున్న ప్రేమకూ, నమ్రతకూ నా ధన్యవాదాలు. ఎప్పుడు, ఎలాంటి విషయం రాయాలన్నా, చర్చించాలన్నా, ఈ రకమైన వైఖరినే కొనసాగించగలవు. మనకున్న ఆయుధాల్లో ఐక్యంగా పోరాడటం ఒకటే కాదు. నిరంతరం విమర్శ-ఆత్మ విమర్శ ఆయుధంతో పదునెక్కటం కూడా!

అభినందనలతో
నీ మావయ్య గంగాధర్

స్పందన్ కళ్ళముందు పెట్టుబడిదారీ వ్యవస్థ వికృతరూపం కనపడుతుంది!

కూలక తప్పని ఈ వ్యవస్థ-తాత్కాలికంగానే అయినా తనపైకి పోరాటం ఎక్కుపెట్టకుండా కోట్లాదిమందిని స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్" అనే ఆయుధంతో బంధిస్తూంది.

కాని అది గుర్తించని విషయం ఒకటుంది.

ఆ ఆయుధమే వారిని 'తిరుగుబాటు' బావుటా ఎగురవేయటానికి నిరంతరం జ్వలింపజేస్తుందని!